
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5
జిల్లా వార్తలు
ఆదివారం 26 జనవరి 2025



దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను అతిథి అధ్యాపకుడి నియామకం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాధిక తెలిపారు. అభ్యర్థులు సంబంధిత పీజీ సబ్జెక్టులో జనరల్ కేటగిరీ అయితే 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. పీహెచ్‌డీ, నెట్ కలిగి ఉండి, బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. దరఖాస్తులను ఈ నెల 27 సాయంత్రం 5.30 గంటల వరకు ఇక్కడ డిగ్రీ కళాశాల కార్యాలయంలో ఇవ్వాలని అన్నారు.

నాలుగు పథకాల అమలుకు
నేడే శ్రీకారం

- లబ్ధిదారుల ఎంపికపై చివరి వరకు కసరత్తు
- దరఖాస్తుదారుల్లో వీడని ఉత్కంఠ
- తొలి విడతలో మండలానికి ఒక గ్రామం ఎంపిక
- అక్కడ వందశాతం పథకాల అమలు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు సంక్షేమ పథకాలను నేడు లాంఛనంగా ప్రారంభించనుంది. గణతంత్రదినోత్సవం రోజున రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇటీవల ఉమ్మడి జిల్లాలో నిర్వహించిన గ్రామ, వార్డు సభల్లో ఈ నాలుగు పథకాల లబ్ధికోసం 3.9 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం, గృహలక్ష్మి పథకం కింద పేదలకు ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10లక్షలకు పెంచుతూ నిర్ణయాలు తీసుకుని అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే.

దశల వారీగా అమలుకు..

పెద్ద సంఖ్యలో దరఖాస్తులు రావడంతో ప్రభుత్వం పథకాలను దశలవారీగా అమలు చేయాలని నిర్ణయించింది. మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసి ఆ గ్రామంలో వందశాతం లబ్ధిదారులకు పథకాలను అమలు చేయనున్నట్లు శనివారం ప్రకటించింది. ఇందుకోసం సదరు గ్రామంలో పథకాల అమలు కోసం నలుగురు మండల స్థాయి అధికారులను నియమిస్తున్నట్లు వెల్లడించింది.

మార్చి 31వ తేదీ వరకు ఈ పథకాలన్నీ అమల్లోకి తెస్తామని తెలిపింది. ఈ దరఖాస్తుల్లో ఇళ్లు, రేషన్ కార్డుల కోసం అధికం గా వచ్చాయి. తొలివిడత లో ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రైతు భరోసా పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

లబ్ధిదారుల ఎంపికలో తర్జనభర్జన

రైతు భరోసా కింద ఎకరానికి రూ. 12వేల వ్యవసాయ పెట్టుబడి సాయం అందించనున్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల కింద లబ్దిదారులకు రూ.5లక్షల చొప్పున అందచేస్తారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమి లేని నిరుపేద కుటుంబాలకు ఏటా రూ.10వేల ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు లబ్ధిదారుల ఎంపిక పూర్తయింది. మిగతా రెండు పథకాలకు లబ్ధిదారుల ఎంపికపై శనివారం రాత్రి వరకు కసరత్తు జరుగుతూనే ఉంది. దీంతో దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ రెండు పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక ప్రభుత్వానికి కూడా సవాల్‌గా మారింది. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలపై ప్రజల్లో అసంతృప్తి వస్తే అసలుకే ఎసరు వస్తుందని భావిస్తున్న సర్కార్ చివరి వరకు లబ్ధిదారుల ఎంపికపై తర్జనభర్జనలు పడుతూనే ఉంది. ఎంపిక ప్రక్రియపై అనుసరిస్తున్న విధానాలపై అధికార పార్టీ నేతల్లో కూడా అసంతృప్తి వ్యక్తం కావడంతో ప్రభుత్వం జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. ఇది దీర్ఘకాలిక ప్రక్రియగా చెబుతోంది. ఎవరికైనా పథకం రాకుంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది.



మంచాల మండల సమీపంలోని ఓ ఫాంల్యాండ్స్‌లో రిసార్ట్

Sunday Special

నగరవాసులు వారాంతపు కాలక్షేపానికి ట్రెండ్ మార్చారు. గతంలో సిటీలోనే పార్కులు, క్లబ్‌లు, పబ్‌ల్లో ఎంజాయ్ చేసేవారు. సెలవులు వస్తే చాలు సినిమాలు, షాపింగ్ మాల్స్‌లో సందడి చేసేవారు. కానీ, ప్రస్తుతం వీకెండ్స్‌లో గ్రామాల బాట పడుతున్నారు. కుటుంబాలతో వెళ్లి నగర శివారులోని పర్యాటక ప్రాంతాలను చూడటానికి ఇష్టపడుతున్నారు. దీంతో పల్లె ప్రాంతాల్లో ఫాం ల్యాండ్స్, రిసార్టులకు గిరాకీ పెరిగింది. ఈ నేపథ్యంలో ఇబ్రహీంపట్నం, మంచాల మండలాల పరిధిలో నగరవాసుల అభిరుచికి అనుగుణంగా రిసార్టులను ఎక్కువగా ఏర్పాటు చేస్తున్నారు.

చలో ఫాంల్యాండ్!

ట్రెండ్ మార్చిన నగరవాసులు

- వీకెండ్స్‌లో రిసార్ట్‌ల బాటపడుతున్న వైనం
- శివారుల్లో పెరిగిన ఫాంల్యాండ్ కొనుగోళ్లు
- అభిరుచికి తగినట్లుగా నిర్మాణాలు
- కుటుంబ సభ్యులతో కలిసి ఆహ్లాద వాతావరణంలో సందడి

మంచాల, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రాజధానికి చేరువలో ఉన్న ఇబ్రహీంపట్నం, మంచాల పరిసర ప్రాంతాల్లో సందర్శకుల సందడి పెరిగిపోయింది. ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫాంలాండ్స్, వెంచర్లలో తమకున్న ఆర్థిక స్థోమతకు అనుగుణంగా ప్లాట్లు కొనుగోలు చేస్తున్నారు. ఆ తర్వాత ఇక్కడ వీకెండ్‌లో సరదాగా గడిపేందుకు ఇళ్లు, గెస్టుహౌజ్‌లు నిర్మించుకుంటున్నారు. ఈ పరిణామం రియల్టర్లకు స్వర్గధామంగా మారింది. దీంతో ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టేందుకు రియల్టర్లు ప్రాధాన్యమిస్తున్నారు. తమ పెట్టుబడులకు లాభాలు ఆశాజనకంగా వస్తుండడంతో రియల్ ఎస్టేట్ ట్రెండ్‌ను కొనసాగిస్తున్నారు.

ప్రకృతి అందాల నడుమ..

మంచాల మండలంలోని గ్రామీణ ప్రాంతాలు ఎత్తైన కొండలు, గుట్టలు, లోయల మధ్య ఉంటాయి. ఇక్కడ వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. ఈ ప్రాంత ప్రకృతి అందాలను చూసేందుకు జనం ఇష్టపడతారు. అలాగే రాచకొండ, శ్రీబుగ్గరామలింగేశ్వర క్షేత్రం, జాపాల-రంగాపూర్ అబ్జర్వేటరీ, బోడకొండ వాటర్‌ఫాల్స్ తదితర పర్యాటక కేంద్రాలు సైతం అదనపు ఆకర్షణగా చెప్పవచ్చు. లోయపల్లి సెక్టార్ మొత్తం గిరిజన ప్రాంతం కావడంతో ఇక్కడి తండాల్లో సంప్రదాయ వస్త్రధారణ కనిపిస్తుంది. ఆరుట్ల సమీపంలోని గ్రామాలు పచ్చని పంట పొలాలతో ఆహ్లాదాన్ని పంచుతాయి.



సేదతీరేందుకు ఏర్పాటు చేసిన లాంజ్‌లు

సహజత్వాన్ని కోల్పోకుండా..

ఇబ్రహీంపట్నం, మంచాల మండలాల పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొండలు, గుట్టల సమీపంలోని వ్యవసాయ భూములను కొనుగోలు చేసి

- మిగతా 7వ పేజీలో..

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డి



అంజిరెడ్డిని సన్మానిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కందుకూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డి ఆ పార్టీ నేతలకు సూచించారు. శనివారం మండలంలోని తిమ్మాపురం గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షునిగా ఎన్నికైన నిమ్మ అంజిరెడ్డిని సన్మానించి మాట్లాడారు. ఆయుష్మాన్‌భారతి, ఉచిత రేషన్‌బియ్యం పంపిణీ, ప్రధానమంత్రి బీమాయోజన, జాతీయ రహదారుల అభివృద్ధి, పీఎంఏవై, తదితర పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకులు గంగాపురం నర్సింహ్మారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను కిషన్‌రెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి, నాయకులు ఎల్మటి దేవేందర్‌రెడ్డి, పున్న భిక్షపతి, ప్రభాకర్, మల్లేష్, రఘునందన్ పాల్గొన్నారు.

రైతుబంధు పేరిట
నిధుల దుర్వినియోగం

- కొండలు, గుట్టలకూ పైసలిచ్చిన బీఆర్‌ఎస్
- వ్యవసాయానికి యోగ్యమైన భూములన్నింటికీ రైతుభరోసా
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

కందుకూరు,జనవరి 24:(ఆంధ్రజ్యోతి): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యవసాయానికి పనికిరాని కొండలకు, గుట్టలకు రైతుబంధు ఇచ్చి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొనం ప్రభాకర్ ఆరోపించారు. వ్యవసాయ భూములన్నింటికీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా పథకం ద్వారా ఎకరాకు సంవత్సరాని రూ.12వేలు అందిస్తామని స్పష్టం చేశారు. ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి 36 పనులకు మంజూరు అయిన రూ.కోటి 63లక్షలు, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల నుంచి మంజూరైన రూ.34 లక్షలతో వివిధ గ్రామాలలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శనివారం కందుకూరు మండల కేంద్రంలో శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికంగా ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 13 నెలల్లోనే 55,143మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. అలాగే 135కోట్ల మంది మహిళలు 405 వేల కోట్ల మేరకు ఉచితంగా ప్రయాణం కల్పించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం మిగులు బడ్జెట్‌లో ఏర్పాటైందని, పదేళ్లలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.7లక్షల కోట్ల అప్పు చేసిందని ఆయన తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. అనంతరం ఫ్యూచర్‌సిటీ, ఫోర్త్‌సిటీ స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, పీసీసీ ప్రచార కమిటీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి, దేవ భాస్కర్ రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ తీగల అనితారెడ్డి, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గంగుల శమంతప్రభాకర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కె.పాండురంగారెడ్డి, మాజీ సర్పంచ్ ఏనుగు శ్రావణి,మంద సాయిలు, నాయకులు ఎస్. మల్లేష్, పాండు, ఎస్.కృష్ణానాయక్, రాణాప్రతాప్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీధర్, అప్జల్‌బేగ్, భూపాల్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, పాండుగౌడ్ జగదీశ్వష్, సత్యనారాయణ, కుమార్, ఆర్‌డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ కె.గోపాల్, ఎంపీడీవో సరిత పాల్గొన్నారు.



కందుకూరులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మంత్రికి వినతి

ఈత చెట్లు పెంచడంతో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఐదెకరాల భూమిని కేటాయించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మండల గౌడ సంఘం అధ్యక్షుడు అనెగౌని పాండుగౌడ్ ఆధ్వర్యంలో వినతి పత్రం

- మిగతా 8వ పేజీలో..

పేదల సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి

కందుకూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): డెబ్బై సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో నిరుపేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, అదే తరహాలో రాష్ట్రంలో పరిపాలన కొనసాగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి విమర్శించారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం రాత్రి మండలంలోని పులిమామిడి గ్రామంలో దళితవాడలో నిర్వహించిన సంవిధాన్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కులాల మధ్య చిచ్చు పెడుతూ మతపరమైన రిజర్వేషన్లను అమలు చేశారని ఆయన గుర్తు చేశారు. నిమ్మ అంజిరెడ్డి, అంబటి యాదగిరి, రఘునందన్, ప్రవీణ్ కుమార్, శ్రీశైలం, దయాకర్‌రెడ్డి, భాస్కర్, ఆంజనేయులు, నరసింహ, నవీన్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగించుకోవాలి



వృద్ధ ఓటరును సన్మానిస్తున్న కలెక్టర్

రంగారెడ్డి అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఓటు హక్కు ఎంతో విలువైనదని, దానిని ప్రతీ ఒక్కరు బాధ్యతగా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. 15వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావడంతో పాటు, యువత ఎన్నికల్లో విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. తాత్కాలిక ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా సీనియర్ సిటిజనులను కలెక్టర్ సత్కరించారు. 'ప్రజాస్వామ్యములో ఓటర్ల పాత్ర' అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీలో విజేతలైన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అలాగే ఎన్నికల్లో పనిచేసిన ఎనిమిది నియోజకవర్గాల బీఎల్‌వోలకు అవార్డులను అందజేశారు. కొత్తగా ఓటు హక్కుపొందిన వారికి ఓటర్ కార్డులను అందజేశారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా గ్రామీణాభివృద్ధి పీడీ, స్వీప్ నోడల్ అధికారి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



గిరిజన రైతులతో సమావేశమైన బీజేపీ నాయకులు

భూములు లాక్కుంటే తిరుగుబాటే

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి వ్యతిరేకంగా గిరిజన రైతుల నిరసన

బీజేపీ నాయకుల సంఘీభావం

ఆమనగల్లు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సాకిబండ తండా సమీపంలో గ్రీన్ ఫీల్డ్ రోడ్డుకు మార్కింగ్ చేసిన గిరిజన రైతుల భూముల్లో శనివారం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి బలవంతంగా భూములు లాక్కుంటే లగచర్ల తరహాలో తిరుగుబాటు తప్పదని గిరిజనులు హెచ్చరించారు. బీజేపీ నాయకులు రైతులకు సంఘీభావం ప్రకటించారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, తెలంగాణ బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్ నాయక్, ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్‌లు సాకిబండ తండా గిరిజన రైతులతో కలిసి మార్కింగ్ ఇచ్చిన గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు భూములను పరిశీలించారు. అనంతరం గిరిజన రైతులతో బీజేపీ నాయకులు సమావేశమయ్యారు. ఔటర్ రింగ్ రోడ్డు కు మూడు వైపులా హైదరాబాద్ - శ్రీశైలం, హైదరాబాద్- బెంగళూరు, హైదరాబాద్-నాగార్జున సాగర్ జాతీయరహదారులు ఉండగా ఎవరు అడగని, అంతగా అవసరం లేని గ్రీన్‌ఫీల్డ్ రెడియల్ రోడ్డు ఎందుకని రైతులు ఈ సందర్భంగా బీజేపీ నేతలతో వాపోయారు. తమ ప్రాణాలు పోయినా భూములు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. కళ్యాణ్ నాయక్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సర్కార్ అభివృద్ధి పేరుతో గిరిజనుల భూములు లాక్కునేందుకు యత్నిస్తుందని మండిపడ్డారు. లగచర్ల తరహా పోరాటానికి సాకిబండ తండా గిరిజనులు సన్నద్ధం కావాలని, అందుకు బీజేపీ అండగా నిలుస్తుందన్నారు. తల్లోజు ఆచారి మాట్లాడుతూ ఎవరు అడుగని గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పేరుతో పేదలు సాగు చేసుకుంటున్న వందల ఎకరాల భూములను లాక్కోవడం ప్రభుత్వానికి సరికాదన్నారు. ప్రభుత్వ నిర్ణయం ఉపసంహరించుకోకపోతే గిరిజనుల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ దుర్గయ్య, బీజేపీ నియోజకవర్గ కోకన్వీనర్ గోరటి నర్సింహ్మ, మాజీ జడ్పీటీసీ కండె హరిప్రసాద్, ఎర్రవోలు శ్రీను, కర్నాటి విక్రమ్ రెడ్డి, దోనాదుల మహేశ్, చెక్కాల లక్ష్మణ్, చెన్నకేశవులు, కృష్ణయాదవ్, దివ్యశ్రీకాంత్ సింగ్ పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు
సర్వం సిద్ధం

ముస్తాబైన కలెక్టరేట్ ● జాతీయ జెండాను ఆవిష్కరించనున్న కలెక్టర్



గౌరవ వందనం చేయడానికి ప్రాక్టీస్ చేస్తున్న పోలీసులు



కలెక్టరేట్‌లో ఏర్పాట్లు

రంగారెడ్డి అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : దేశం మనదే.. తేజం మనదే.. ఎగురుతున్న జెండా మనదే.. అంటూ ప్రతీ భారతీయుడు సగర్వంగా తలెత్తుకునేలా.. భారత సర్వోన్నత రాజ్యాంగం అమలులోకి వచ్చి.. గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవించిన శుభదినం జనవరి 26. ఆదివారం జిల్లా వ్యాప్తంగా గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని కలెక్టరేట్‌లో ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటలకు కలెక్టర్ సి. నారాయణరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. 9.05 గంటలకు గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు. 9.10 గంటలకు కలెక్టర్ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. ఉదయం 9.20 గంటలకు శకటాల ప్రదర్శన నిర్వహిస్తారు. 9.40 గంటలకు బాల బాలికల విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉదయం 10.15 గంటలకు ఉత్తమసేవ సర్టిఫికెట్ల ప్రదానం, 10.45 గంటలకు స్టాళ్ల సందర్శన ఉంటుంది. వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్ సందర్శిస్తారు. 10.50 గంటలకు వందన సమర్పణతో కార్యక్రమం ముగియనుంది.

ఆక్రమణలో బొంతపల్లి కుంట

ఇబ్రహీంపట్నం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నంలోని బొంతపల్లి కుంటను కొందరు అక్రమార్కులు రాత్రికిరాత్రే మట్టి పోసి చదును చేస్తున్నారు. ఓవైపు 'హైడ్రా' చెరువులు, కుంటల్లో ఆక్రమణలను తొలగించే పనిలో ఉండగా.. ఇక్కడ మాత్రం ఎఫ్‌టీఎల్‌లో మట్టిపోసి కుంటను చెరబడుతున్నారు. ఈ కుంట ఎఫ్‌టీఎల్ 20 ఎకరాలుండగా గతంలో కొందరు కుంటను ఆక్రమించే ప్రయత్నం చేయగా ఇరిగేషన్ అధికారులు అడ్డుపడ్డారు. తిరిగి రాత్రివేళల్లో టిప్పర్ల ద్వారా మట్టిని తోలుతూ ఎఫ్‌టీఎల్ ఆక్రమణకు పాల్పడుతున్నారు. ఇదే విషయమై ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ సాయికుమార్ మాట్లాడుతూ శనివారం కుంటను సందర్శించి ఎఫ్‌టీఎల్‌లో పోసిన మట్టిని తొలగించాల్సిందిగా ఆదేశించామన్నారు. తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులతోపాటు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



మట్టితో పూడ్చిన ఇబ్రహీంపట్నంలోని బొంతపల్లి కుంట

నేడు ప్రభుత్వ పథకాలు ప్రారంభం

మేడ్చల్ ప్రతినిధి, 25(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లాలో ఆదివారం నాలుగు ప్రభుత్వ పథకాలను అమలు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి శనివారం కలెక్టరేట్‌లో తెలిపారు. మేడ్చల్ మండలం సోమారం, శామీర్‌పేట మండలం పొన్నాల్, కీసర మండలం భోగారం, మూడుచింతలపల్లి కేశవరం, ఘట్‌కేసర్ మండలం ఘనాపూర్‌లో పథకాల లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తామని విజయేందర్‌రెడ్డి తెలిపారు.

ఆర్టీఏ మెంబర్‌కు అందని ఆహ్వానం

వికారాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆర్టీఏ అధికారులు ప్రొటోకాల్ మారిచారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలకు ఆర్టీఏ మెంబర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వికారాబాద్ జిల్లాకు సంబంధించి ఎర్రవల్లి గ్రామానికి చెందిన మాజీ కోఆప్షన్ మెంబర్, మాజీ సర్పంచ్ ఎర్రవల్లి జాఫర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు అందజేసింది. అయితే ఆదివారం జరిగే గణతంత్ర వేడుకలకు మాత్రం ఆహ్వానం అందించడంలో ఆర్టీఏ అధికారులు నిర్లక్షం చేశారు. జిల్లాలో ఆర్టీఏ మెంబర్లను ముఖ్య అతిథులుగా పిలిచిన ఆ శాఖ వికారాబాద్ జిల్లాలో కనీసం ఆహ్వానం కూడా అందించకపోవడం గమనార్హం. ఈ విషయంలో నిరాశచెందిన ఆర్టీఏ మెంబర్ ఈ విషయాన్ని స్పీకర్ దృష్టికి తీసుకపోవడంతోపాటు రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు సన్నిహితులతో చర్చించినట్లు సమాచారం.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

బొంరాస్‌పేట్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బొంరాస్‌పేట్ మండలంలోని మేడిగడ్డ తండాకు చెందిన మూడవత్ గణేశ్ తన సెల్‌ఫోన్ పోగొట్టుకొని బొంరాస్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీఈఐఆర్ పోర్టర్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీని ట్రేస్ చేసి శనివారం బాధితుడికి అందించినట్లు తెలిపారు.

సీఎంను కలిసిన ఎంపీ మల్లు రవి


సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మల్లు రవి

ఆమనగల్లు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. దావోస్ పర్యటన సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో సన్ పెట్రో కెమికల్స్ పంప్డ్ స్టోరేజీ హైడ్రోపవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు రూ.45,500 కోట్ల పెట్టుబడులు సాధించినందుకు సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు మల్లు రవి పేర్కొన్నారు. దావోస్ పర్యటన ద్వారా రాష్ట్రానికి సాధించిన రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా ఎంతో మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన రాఘవేందర్ రెడ్డి


రాఘవేందర్ రెడ్డిని సన్మానిస్తున్న మంత్రి సీతక్క

ఆమనగల్లు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి శనివారం రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క)ను మర్యాద పూర్వకంగా కలిశారు. ములుగు నియోజకవర్గంలో టాస్క్ రీజినల్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు పేర్కొన్నారు. టాస్క్, ఐక్యత ఫౌండేషన్ ద్వారా రాఘవేందర్‌రెడ్డి అందిస్తున్న సేవలను మంత్రి సీతక్క ఈ సందర్భంగా కొనియాడినట్లు సుంకిరెడ్డి పేర్కొన్నారు. టాస్క్ ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తామని రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

ఢిల్లీకి గరగ బృందం

రిపబ్లిక్ డే వేడుకలకు జిల్లా కళాకారులు


ఢిల్లీ రిపబ్లిక్ డే పరేడ్ మైదానంలో జిల్లా కళాకారులు, విద్యార్థులు

తాండూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రతి సంవత్సరం భారత ప్రభుత్వం ఢిల్లీలో నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఈసారి తాండూరు డ్యాన్స్ మాస్టర్ అశోక్‌తోపాటు జిల్లాకు చెందిన 12 మంది కళాకారుల బృందం పరేడ్‌లో పాల్గొనడానికి ఎంపికయ్యారు. ఈ వేడుకల్లో కళాకారులు ఆంధ్రప్రదేశ్ జానపద కళారూపం గరగ నృత్యం చేయనున్నారు. ఈ బృందానికి అంతర్జాతీయ గరగ కళా బృందం కేవై ప్రసాద్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇంతటి గొప్ప అవకాశం కల్పించిన కేంద్ర ప్రభుత్వం, సాంస్కృతిక శాఖకు ఢిల్లీ సంగీత నాటక అకాడమీకి చెందిన టీమ్ లీడర్ ప్రసాద్, డ్యాన్స్ మాస్టర్ అశోక్ కృతజ్ఞతలు తెలిపారు.

రిపబ్లిక్ డే వేడుకలకు అనురాగ్ విద్యార్థులు



ఘట్‌కేసర్ రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్ -2025 కార్యక్రమానికి అనురాగ్ యూనివర్సిటీ నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఐటీ విభాగంలో 3వ సంవత్సరం చదువుతున్న నితిన్, ఈసీఈ 3వ సంవత్సరం చదువుతున్న కిషన్ సాయితేజ ఎంపిక కాగా ఐటీ విభాగానికి చెందిన అభినవ దీక్షన పేరేడ్ కార్యక్రమంలోని ప్రధానమంత్రి ర్యాలీలో పాల్గొంటారు. శనివారం అనురాగ్ యూనివర్సిటీ సీఈవో సూర్యదేవర నీలిమ, వైస్‌చాన్స్‌లర్ అర్చన మంత్రి, రిజిస్ట్రార్ భాస్కర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లేష్ ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

పోచారం బల్దియా అభివృద్ధికి రూ.2.2 కోట్లు


పోచారం మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్. జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతరం చర్యలు తీసుకుంటున్నామని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన చివరి సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసమావేశంలో రూ.2.20 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులతోపాటు వివిధ కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించారు. ప్రధానంగా మున్సిపల్ కార్యాలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు, విలీన గ్రామాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్, పారిశుధ్య విభాగానికి అవసరమైన వస్తువుల కొనుగోలు, ప్రజాపాలన నిర్వహణ, స్టేషనరీ కొనుగోలు, డ్రైనేజీల మరమ్మతు పనులకు నిధులు వెచ్చించాలని తీర్మానించారు. ఐదేళ్లపాటు సమష్టి కృషితో మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసినట్లు చైర్మన్ గుర్తు చేశారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని పేర్కన్నారు. శక్తికి మించి పనులు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నానావత్ రెడ్డియా నాయక్, కమిషనర్ వీరారెడ్డి, కౌన్సిలర్లు మహేష్, ధనలక్ష్మి, రాజశేఖర్, సాయిరెడ్డి, శైలజ, బాల్‌రెడ్డి, వెంకటేష్, లక్ష్మి, హరిప్రసాదరావు, శ్రీలత, రవీందర్, సరిత, సుధాలక్ష్మి, మమత కోఆప్షన్ సభ్యులు అక్రం అలీ, శంకర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఊరెళ్లను మున్సిపాలిటీలో కలపొద్దు

చేవెళ్ల ఎమ్మెల్యేను కలిసిన గ్రామస్తులు


ఎమ్మెల్యే యాదయ్యకు వినతిపత్రం ఇస్తున్న ఊరెళ్ల గ్రామస్తులు, నాయకులు

చేవెళ్ల, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఊరెళ్ల గ్రామాన్ని చేవెళ్ల మున్సిపాలిటీలో కలపొద్దని ఊరెళ్ల గ్రామస్తులు చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్యను కోరారు. శనివారం వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్ మండల పరిధిలోని చించల్‌పేట్‌లో ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి మున్సిపాలిటీలో ఊరెళ్లను విలీనం చేయొద్దని కోరుతూ వినతి పత్రం అందించారు. గ్రామస్తులు మాట్లాడుతూ మున్సిపాలిటీలో తమ గ్రామాన్ని విలీనం చేస్తే అన్నివిధాలా నష్టపోతామన్నారు. చేవెళ్లకు దూరంగా ఉన్న గ్రామాన్ని మున్సిపాలిటీలో కలపొద్దని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. చేవెళ్ల మాజీ వైస్ ఎంపీపీ శివప్రసాద్, మాజీ సర్పంచ్‌లు అరుణనర్సింలు, జహంగీర్, నాయకులు సీహెచ్ యాదయ్య, శ్రీనివాస్, బి.యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.



మంచాల మండల సమీపంలోని ఓ ఫాంల్యాండ్


ఆటల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

చలో ఫాంల్యాండ్!

(5వ పేజీ తరువాయి)

వెంచర్లు, ఫాంల్యాండ్స్, రిసార్టులు ఏర్పాటు చేస్తున్నారు. వీటిల్లో కస్టమర్ల ఆర్థిక వెసులుబాటుకు అనుగుణంగా గుంటలు, ఎకరాలుగా విభజించి విక్రయిస్తున్నారు. ఆ తర్వాత స్తోమతను బట్టి గృహ నిర్మాణాలు, స్విమ్మింగ్‌పూల్స్, గార్డెన్స్, చిల్డ్రన్ ప్లే ఏరియాలుగా నిర్మాణాలు చేసి కస్టమర్లకు అందజేస్తున్నారు. అంతేగాక ఇట్టి నిర్మాణాల్లో రాళ్లు, చెట్లు ఉన్నచోట్ల సహజత్వాన్ని కోల్పోకుండా అందంగా తీర్చిదిద్దుతున్నారు.

ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా..

విడిది కేంద్రాలు ఆర్థిక స్తోమతకు అనుగుణంగా అందుబాటులో ఉన్నాయి. ధనవంతులు స్వతహాగా భూమి కొనుగోలు చేసి తమ అభిరుచికి తగ్గట్టు ఫాంహౌజ్ నిర్మించుకుంటున్నారు. అలాగే వ్యాపారపరంగానూ ఈ ప్రాంతంలో రిసార్టులు నిర్మించి రోజువారీ అద్దెలకు ఇస్తున్నారు. అన్ని సౌకర్యాలతో నిర్మించిన ఈ రిసార్టులను శుభకార్యాల కోసం అద్దెకు ఇస్తుంటారు. ఫంక్షన్స్ స్థాయిని బట్టి రోజుకు రూ.10 వేల నుంచి రూ.2 లక్షల వరకు అద్దె తీసుకుంటారు. సిటీలో ఉండే కుటుంబాలు వీకెండ్‌లో స్టే చేయడానికి రిసార్టుల్లో రూ. 2-3 వేల అద్దెతో ఏర్పాట్లు సైతం ఉన్నాయి. ఆన్‌లైన్‌లో కూడా బుకింగ్ చేసుకునే వెసులుబాటు ఉంది.

టూరిస్టు హబ్‌గా మారబోతుంది

మంచాల ప్రాంతం టూరిస్ట్ హబ్‌గా మారనుంది. నగర వాసులు శివారులో శుభకార్యాలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇటీవలి కాలంలో అతి తక్కువ మందితో ఫంక్షన్స్ చేసుకుంటున్నారు. వారి అభిరుచి మేరకు రిసార్టు ఏర్పాటు చేశాం. పది ఇరవై మందితో చేసుకునే చిన్న ఫంక్షన్స్ మొదలు కొని భారీ ఎత్తున జరిగే పెళ్లిళ్లను సైతం ఇక్కడ జరిపించుకోవచ్చు. ఈ ప్రాంతంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండడంతో రిసార్టులు నిర్మించేందుకు మరికొందరు ముందుకు వస్తున్నారు.

- అంజన్‌కుమార్, రిసార్టు ఎండీ

సొంతంగా రిసార్టు నిర్మించుకున్నాం

వీకెండ్‌లో కుటుంబంతో గడిపేందుకు ఫాంహౌజ్ సొంతంగా ఏర్పాటు చేసుకోవాలని అనుకున్నాం. మా ఫ్రెండ్‌తో కలిసి మంచాల మండల పరిధిలో భూమిని కొనుగోలు చేసి రిసార్టు ఏర్పాటు చేసుకున్నాం. సెలవు రోజుల్లో కుటుంబంతో కలిసి కాలక్షేపం చేసి వెళ్తున్నాం. ఇక్కడి వాతావరణం చాలా బాగుంది. మా రిసార్టును చూసి మా ఇతర స్నేహితులు కూడా ఇక్కడ భూమిని కొనుగోలు చేసి ఫాంహౌజ్ నిర్మించుకోవాలనుకుంటున్నారు.

- ఉదయ్‌కుమార్‌రెడ్డి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

కొత్తగా పాస్‌బుక్‌లు పొందినవారు
'రైతు భరోసా'కు దరఖాస్తు చేసుకోవాలి

ఆమనగల్లు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రైతు భరోసా పథకం కింద ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయానికి కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. 2024 డిసెంబరు 31వ తేదీ వరకు పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులతో పాటు ఇదివరకే పాసుబుక్ ఉండి రైతు భరోసా, రైతుబీమా పథకాలు పొందని రైతులు కూడా ఈనెల 28 వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

అర్హులందరూ ఓటు హక్కు కలిగి ఉండాలి


ప్రతిజ్ఞ చేయిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ ప్రతినిధి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో శనివారం అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఉద్యోగులందరితో ప్రతిజ్ఞ చేయించారు. అంతకు ముందు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఏడాదికి నాలుగు సార్లు ఓటరుగా నమోదుకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేరు నమోదు చేసుకుని, ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, జిల్లా భూ సేకరణ అధికారి శంకర్ కుమార్ పాల్గొన్నారు. ఓటు హక్కుపై నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు, స్వీప్ కార్యక్రమాలను బాగా ప్రచారం చేసిన టీఎస్ఎస్ కళాకారులకు సర్టిఫికెట్లు, మెమెంటోలను ప్రదానం చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నవాబుపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై అరుణ్‌కుమార్ గౌడ్ సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

పూడూరులో..

మండలంలోని మన్నెగూడచౌరస్తాలో శనివారం రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. చెన్‌గోముల్ పోలీసు స్టేషన్ పరిధిలోని మన్నెగౌడ చౌరస్తాలో పోలీసులు రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపల్, కౌన్సిల్ చివరి సమావేశం వాదోపవాదాలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు మధ్య సుదీర్ఘంగా సాగింది. శనివారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ స్వప్న అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. సమావేశంలో 30మీటర్ల జెండా ఆవిష్కరణ, ఖర్చులు, సంవత్సర కాలంపాటు నిర్వాహణకు సంబంధించి ప్రవేశపెట్టిన రూ.9 లక్షల మున్సిపల్ సాధారణ నిధులపై చర్చించారు. ఈ విషయంలో మున్సిపల్ ఏఈ ఖాజా హుస్సేన్‌ను పలువురు కౌన్సిలర్లు ప్రశ్నించారు. తాండూరు పట్టణంలో తాండూరు మాన్యుమెంట్ (ఐ లవ్ తాండూరు) నిర్మించేందుకు రూ.8 లక్షలు కేటాయిస్తూ కౌన్సిల్ తీర్మానించింది. కంజర్వెన్సీ , సేఫ్టీ మెటీరియల్ కొనుగోలుకు ప్రవేశపెట్టిన రూ. 40 లక్షల అంచన వ్యయాన్ని కౌన్సిల్ తప్పు పడుతూ ఈ అంశాన్ని తొలిగించాలని కోరారు. తాండూరు మాతా శిశు ఆస్పత్రి బస్టాప్ షెల్టర్ నిర్మాణానికి ఆమోదం తెలిపారు.

బీఆర్ఎస్ కౌన్సిలర్ల నిరసన

సమావేశంలో తమకు సమస్యలు చెప్పుకోవడానికి చైర్‌పర్సన్ అవకాశం ఇవ్వకుండా బీజేపీ కౌన్సిలర్లకు అవకాశం ఇచ్చారని నిరసిస్తు బీఆర్ఎస్‌కు చెందిన వైస్ చైర్‌పర్సన్ పట్లోళ్ల దీప, కౌన్సిలర్లు మంకాల రఘు, సంగీత ఠాకూర్, వరాల శ్రీనివాస్ రెడ్డి, శోభారాణి, ఆసిఫ్, ముక్తార్ నాజ్, తదితరులు కౌన్సిల్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అవినీతి చైర్‌పర్సన్ మాటలకే విలువ ఇచ్చారని ఆరోపించారు. నిధులను దుబారా చేశారని పేర్కొన్నారు. చైర్‌పర్సన్ స్వప్నకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయితే ప్రజా సమస్యలపైన మాట్లాడేందుకు సుమారు నాలుగున్నర గంటల వరకు కౌన్సిల్ సమావేశం నిర్వహించామని, అందులో విపక్షాలకే అధిక సమయం కేటాయించినట్లు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న విలేకరుల సమావేశంలో తెలిపారు. తాండూరు సమగ్ర అభివృద్ధికి త్వరలోనే అధికారులందరితో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు అందించాలి


మాట్లాడుతున్న పాల్మాకుల జంగయ్య

చేవెళ్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అందించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్మాకుల జంగయ్య కోరారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అర్హులైన ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించాలన్నారు. ముఖ్యంగా రేషన్ కార్డులు అందించాలని, రైతులకు రుణమాఫీ చేయాలన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో సీపీఐని మరింత బలోపేతం చేసేందుకు గ్రామగ్రామాన పార్టీ జెండా ఎగరవేస్తున్నట్లు చెప్పారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినాటి నుంచి నిత్యవసర వస్తువుల ధరలు బాగా పెరిగాయని, కేంద్ర ప్రభుత్వం నక్సలైట్లను పిట్టలా కల్చివేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ వందేళ్ల ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ఈనెల 27న చేవెళ్ల పట్టణ కేంద్రంలో సీపీఐ జనరల్ బాడీ సమావేశం కేజీఆర్ గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశానికి సీపీఐ పక్షనేత ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు హాజరు కానున్నారని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు రామస్వామి, ప్రభులింగం, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణచారి, ఆయా మండలాల ప్రధాన కార్యదర్శులు సత్తిరెడ్డి, సుధీర్, జంగయ్య, శ్రీనివాస్, మండల మహిళ అధ్యక్షురాలు వడ్ల మంజులు, నాయకులు మగ్బుల్, అంజయ్య, నర్సింలు, శివ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న భాను ప్రకాష్

షాద్‌నగర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని షాద్‌నగర్ టోల్‌ప్లాజా రోడ్‌సేఫ్టీ మేనేజర్ భానుప్రకాష్ కోరారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా రాయికల్ టోల్‌ప్లాజా వద్ద యునిసెఫ్, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్, షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా 1500 మంది విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణ, పాటించాల్సిన నియమనిబంధనల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ బాల్యం నుంచే రోడ్డు భద్రత గురించి విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్సై రవీందర్ నాయక్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు వారి తల్లితండ్రులను కూడా అరెస్టుచేసే అవకాశం ఉంటుందన్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపినా జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.

విద్యార్థులు సేవాగుణాన్ని అలవర్చుకోవాలి


కళావేదికను ప్రారంభిస్తున్న వైటెక్ సిబ్బంది, దాతలు, ఉపాధ్యాయులు

చౌదరిగూడ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు సేవాగుణాన్ని అలవర్చుకోవాలని, అలాంటి వారికే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని వైటెక్ సిస్టమ్స్ ఆసియా ప్రైవేట్ లిమిటెడ్-హైదరాబాద్ డైరెక్టర్ సంజీవయ్య అన్నారు. శనివారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో వైటెక్ సిస్టమ్స్ ఆసియా ప్రైవేట్ లిమిటెడ్-హైదరాబాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోర్ట్స్ మెటీరియల్, రూ.6 లక్షలతో నిర్మించిన డాక్టర్ అబ్దుల్ కలాం కళావేదికను వారు ఉపాధ్యాయులతో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యనభ్యసించడమే కాకుండా సామాజిక సేవ అలవర్చుకోవడం ద్వారా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. అలాగే చౌదరిగూడ గ్రామానికి చెందిన వ్యాపారవేత్తలు కోనేరి శ్రీనివాస్, ఆకారపు నాగరాజు, తాటిశెట్టి చంద్రశేఖర్‌లు విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేశారు. జిల్లేడ్‌చౌదరిగూడ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ జగదీశ్వర్, సంస్థ ప్రతినిధులు సీనియర్ డైరెక్టర్ సంతోష్‌రౌత్, హరికృష్ణ, గంగాధర్, విశ్వనాథ్, విజయ, బస్వరాజ్, గాయత్రీ రమ్యశ్రీ, జీహెచ్ఎం సునీత, ఉపాధ్యాయులు శంకర్, నరేందర్, కుషాల్, లావణ్య, భానుచంద్ర, ఎజాజ్, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు చేయూతనందించాలి

కడ్తాల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం చేయూతనందించి మనోధైర్యం కల్పించాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. పథకాల అమలులో రాజకీయాలకు చోటివ్వకూడదని కోరారు. కడ్తాల మండల కేంద్రంలోని పలు వార్డుల్లో శనివారం డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కడారి రామకృష్ణలతో కలిసి దశరథ్ నాయక్ పర్యటించారు. కడ్తాలలో అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న గురిగళ్ల శేఖర్‌ను ఆయన పరామర్శించారు. వైద్య చికిత్సల నిమిత్తం జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వరికుప్పల కృష్ణయ్య కుమార్తె దీపిక కొంత కాలంగా మానసిక స్థితి బాగాలేక ఇబ్బంది పడుతుండడంతో దశరథ్ నాయక్ పరామర్శించి రూ.5వేలు అందించారు. మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ రూ.10వేలు, గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్ రూ.5వేలు అందించారు. మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, హరిచంద్‌నాయక్, నాయకులు లాయక్‌అలీ, రాంచంద్రయ్య, వెంకటేశ్, పాండు, మహేశ్, అంజి, శ్రీకాంత్, రాజు, కరుణాకర్, సత్యం ఉన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా బీజేపీ


మలిపెద్ది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులకు బీజేపీ అండగా నిలుస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. షాద్‌నగర్ పట్టణానికి చెందిన మలిపెద్ది శ్రీనివాసులు గుప్తా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఈమేరకు శనివారం ఆయన్ను పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అన్నిరంగాల్లో రాణిస్తుండటం హర్షణీయమని అన్నారు.

ఐదేళ్లలో చెప్పుకోదగిన ప్రగతి


ఝాన్సీశేఖర్‌తో కలిసి పనులు ప్రారంభిస్తున్న రాంపాల్‌నాయక్

ఆమనగల్లు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని బాధ్యతగా భావించి నిరంతరం అందుబాటులో ఉంటూ ఆమనగల్లు మున్సిపాలిటీని అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపామని మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్యలు అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో మరోమారు ఆమనగల్లు మున్సిపాలిటీలో బీజేపీ అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఆమనగల్లు మున్సిపాలిటీ 12వ వార్డు శాంతినగర్ కాలనీలో రూ.5లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులను శనివారం కౌన్సిలర్ ఝాన్సీశేఖర్‌తో కలిసి రాంపాల్ నాయక్ ప్రారంభించారు. ఎస్‌బీసీ మాజీ సభ్యుడు ఆచారి హాజరయ్యారు. కౌన్సిలర్లు లక్ష్మణ్, యాదమ్మశ్రీశైలం, దివ్యశ్రీకాంత్ సింగ్, కృష్ణనాయక్, విక్రమ్‌రెడ్డి, కృష్ణ, బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీను, నాయకులున్నారు.


ఆమనగల్లు : ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీవో శ్రీను, తహసీల్దార్ లలిత, చైర్మన్ రాంపాల్


చేవెళ్ల : మండల కేంద్రంలో సీనియర్ సిటిజన్‌లను సత్కరిస్తున్న తహసీల్దార్ కృష్ణయ్య తదితరులు


కందుకూరు : మండల కేంద్రంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ గోపాల్

ఉత్సాహంగా జాతీయ ఓటరు దినోత్సవం


ఇబ్రహీంపట్నం : యువ ఓటర్లచే ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ అనితారెడ్డి


కడ్తాల : అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తదితరులు

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జిల్లావ్యాప్తంగా ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలు, పాఠశాలల విద్యార్థులతో కలిసి అధికారులు ర్యాలీలు నిర్వహించారు. ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటుహక్కు విలువను కాపాడుతామని, ప్రలోభాలు, ఒత్తిళ్లకు లోనుకాకుండా ఓటు వినియోగించుకుంటామని యువకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులతో ఉపాధ్యాయులు మాక్ అసెంబ్లీ నిర్వహించారు. మరికొన్ని చోట్ల సీనియర్ సిటిజన్‌లను ఘనంగా సన్మానించారు.


యాచారం : మేడిపల్లి హైస్కూల్లో మాక్ అసెంబ్లీ


చౌదరిగూడ : ర్యాలీ సందర్భంగా మాట్లాడుతున్న తహసీల్దార్ జగదీశ్వర్

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మాడ్గుల, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని అందుగులకు చెందిన కొప్పుల జంగయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఈమేరకు ఎమ్మెల్యే సహకారంతో మంజూరైన రూ.30 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం జంగయ్యకు ఆయన స్వగృహంలో అదే గ్రామానికి చెందిన సింగిల్‌విండో డైరెక్టర్ జగన్‌గౌడ్ అందచేశారు.

పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ

ఇబ్రహీంపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పదవీకాలం ముగుస్తున్న సందర్భంగా ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈమేరకు శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద మహిళా పారిశుధ్య కార్మికులకు ఆమెఉ చీరెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్‌సాగర్ తదితరులు ఉన్నారు.


చీరెలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి

ప్రజాపాలనలో అభివృద్ధికి పెద్దపీట


కేశంపేట : తొమ్మిదిరేకులలో ముదిరాజ్ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనలో అభివృద్ధికి పెదపీట వేస్తున్నట్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. శనివారం కేశంపేట మండలంలో ఆయన పర్యటించి, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. బైర్కాన్‌పల్లిలో రూ.12లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణం, కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్వశిక్ష అభియాన్ నిధులు రూ.39లక్షలతో అదనపు తరగతుల నిర్మాణానికి భూమిపూజ, అంబేడ్కర్, ఆదర్శ యువజన సంఘాల భవనాలు, ఐమాక్స్ లైట్లు ప్రారంభం, విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. నిర్ధవెల్లిలో రూ. 10లక్షలతో అంబేడ్కర్ యువజన సంఘం భవన నిర్మాణం, తొమ్మిదిరేకులలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.10లక్షలతో ముదిరాజ్ భవన నిర్మాణం, తొమ్మిదిరేకుల నుంచి కాకునూర్ వరకు బీటీ రోడ్డు పనుల ప్రారంభం, సుందరాపురంలో ఉపాధిహామీ నిధులు రూ.20లక్షలతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కేశంపేట నుంచి కమ్మదానం వరకు బీటీ రోడ్డు ప్యాచ్‌వర్క్‌లను ప్రారంభించారు. తహసీల్దార్ అజంఅలీ, ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, ఆర్ అండ్‌బీ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఎంపీవో కిష్టయ్య, సీడీపీవో షబానాహుస్సేన్, పార్టీ మండలాధ్యక్షుడు వీరేశ్, ఏఎంసీ మాజీ చైర్మన్ యాదయ్య యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, ఏఎంసీ డైరెక్టర్లు భాస్కర్‌గౌడ్, కరుణాకర్, పల్లె ఆనంద్ కుమార్, శ్రీధర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, తాండ్ర శ్రవణ్‌రెడ్డి, రూప్లానాయక్, యాదగిరి చారి, సురేష్ రెడ్డి, వై. గిరిదర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సారూ.. న్యాయం చేయండి

చౌదరిగూడ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే సారూ.. మాగోడు విని న్యాయం చేయండి అంటూ లాల్‌పహాడ్ రెడిహిల్స్ వెంచర్ బాధితులు శనివారం సాయంత్రం షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని గోడు వెల్లబోసుకున్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధి వనంపల్లి శివారులోని సర్వేనంబర్ 86లో గల భూమికి సంబంధించిన వివిధ గ్రామాలకు చెందిన నిరుపేదలు, ప్రజలు, రైతులు పెద్దఎత్తున క్యాంపు కార్యాలయానికి చేరుకొని న్యాయం చేయాలని ఎమ్మెల్యేను వేడుకున్నారు. పన్నెండేళ్ల క్రితం వెంచర్ చేశామని, కొంతమంది ఆ భూమి మాదంటూ.. రాత్రికిరాత్రే ఇళ్ల స్థలాలకు సంబంధించిన హద్దురాళ్లను దౌర్జన్యంగా తొలగించారని, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎమ్మెల్యేకు వివరించారు. కాగా, ఇళ్ల స్థలాలోకి వస్తే చంపుతామని బెదిరిస్తున్న వ్యక్తుల నుంచి రక్షణ కల్పించి న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు తెలిపేందుకు బాధితులంతా క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు.

రైతుబంధు పేరిట నిధుల దుర్వినియోగం

(5వ పేజీ తరువాయి)

అందించారు. నాయకులు మహేష్‌గౌడ్, శేఖర్‌గౌడ్, రవీందర్ గౌడ్, మల్లేష్‌గౌడ్, వెంకటష్‌గౌడ్, భిక్షపతిగౌడ్ తదితరులున్నారు.

మహేశ్వరానికి అదనపు బస్సులు కేటాయించాలి

మహేశ్వరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహేశ్వరం ఆర్టీసీ డిపోకు అదనపు బస్సులు కేటాయించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కూన యాదయ్య, నేనావత్ రాజునాయక్‌లు మంత్రి పొన్నంను కోరారు. శనివారం వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసేందుకు మహేశ్వరానికి వచ్చిన మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. మహేశ్వరం వరకు ఎలక్ట్రిసిటీ, ఏసీ బస్సులతో పాటు శ్రీశైలం వెళ్లే కొన్ని బస్సులను మహేశ్వరం డిపో మీదుగా వచ్చేలా చూడాలని మంత్రికి విన్నవించారు. స్పందించిన మంత్రి ఆర్టీసీ అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

సీసీ రోడ్డుకు రూ.5లక్షలు మంజూరు

ఆమనగల్లు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మేడిగడ్డ తండాలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరయ్యాయి. శనివారం నగరంలో మంజూరు ప్రొసీడింగ్‌ను స్థానిక నాయకుడు విజయ్‌రాథోడ్‌కు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అందజేశారు. అభివృద్ధి పనులు నాణ్యతగా, వేగవంతంగా చేపట్టాలని ఎమ్మెల్యే కసిరెడ్డి ఆయనకు సూచించినట్లు తెలిపారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

షాబాద్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కిసాన్‌మోర్చా మండలాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం మన్‌మర్రి ప్రాథమిక పాఠశాలకు శ్రీధర్‌రెడ్డి రూ.10వేల సౌండ్ సిస్టమ్, గణతంత్ర వేడుకల సందర్భంగా ఆటల పోటీల్లో గెలిచిన విద్యార్థులకు వెంకట్‌రెడ్డి రూ.5వేల బహుమతులను పాఠశాలకు అందజేశారు. ఉపాధ్యాయులు తదితరులున్నారు.

పేదల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

తలకొండపల్లి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పేదల శ్రేయస్సు, రాష్ట్రాభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. తలకొండపల్లి మండల కాంగ్రెస్ నాయకులతో శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. స్థానికంగా నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. అసంపూర్తి పనులు వేగవంతంగా చేపట్టి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాను శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కేశవ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీశైలంలతో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. శ్యామ్‌సుందర్‌రెడ్డి, విష్ణుగౌడ్, భిక్షపతి, కాకి కృష్ణ, శివ, వెంకటేశ్, అనంతరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాబా, విజయ్‌రాథోడ్, సూదిని కొండల్‌రెడ్డి, కృష్ణనాయక్, వెంకట్‌రెడ్డి, దారెడ్డి అంజన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు నాయకుల సన్మానం

చేవెళ్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన పాండుయాదవ్‌ను శుక్రవారం చేవెళ్ల మండల కురుమ సంఘం నాయకులు, చేవెళ్ల మార్కెట్ కమిటీ పాలక వర్గం నాయకులు ఘనంగా సన్మానించారు. పాండుయాదవ్ మాట్లాడుతూ చేవెళ్ల మండలంలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులేకుండా కృషి చేస్తానన్నారు. పార్టీలో కష్టపడి పని చేసినందుకు మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవి అప్పగించడం సంతోషంగా ఉందని చెప్పారు. చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ బి.రాములు, మండల కురుమ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు దండు సతీష్ కుమార్, తదితరులు ఉన్నారు.



సంక్షిప్తంగా..

తలకొండపల్లి : మండల కేంద్రం ఏర్పాటు కోసం ఎంతటి పోరాటానికైనా వెనుకాడబోమని జేఏసీ నాయకులు స్పష్టంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్‌లో ఆమోదించిన 11 కొత్త మండలాల జాబితాలో గట్టిప్పలపల్లి పేరు లేకపోతే ఆమరణ నిరహార దీక్ష చేపడుతామని హెచ్చరించారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు శనివారం 86వ రోజుకు చేరాయి. జేఏసీ నాయకులు, మహిళలు, యువకులు, సంఘాల నేతలు పాల్గొన్నారు.

కేశంపేట : షాద్‌నగర్ పట్టణానికి బీఆర్ఎస్ యువనాయకుడు నందారం అశోక్‌యాదవ్ మండల పరిధిలోని సంతాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 60మంది విద్యార్థులకు శనివారం షూస్ అందించారు. బీఆర్ఎస్ నాయకులు సాజిద్, ప్రభాకర్‌రెడ్డి, భద్రప్ప, యూసుఫ్, లక్ష్మయ్య, మహేష్, ఉపాధ్యాయుడు అరుణ్‌కుమార్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

తలకొండపల్లి : పేద విద్యార్థిని ఉన్నత విద్యకు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ వెంకటేశ్ చేయూతనందించారు. కేరళకు చెందిన కామినేని మహేశ్ కల్వకుర్తి నియోజకవర్గంలో నివాసముంటున్నాడు. కుటుంబ పేదరికం మూలంగా కూతురు జూన జాన్సన్ ఉన్నత చదువుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. దాంతో విద్యార్థిని తండ్రి వెంకటేశ్‌ను కలిసి చదువుకు చేయూతనందించాలని కోరారు. స్పందించిన వెంకటేశ్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.20వేలు ఆర్థిక సాయం సమకూర్చగా తలకొండపల్లి మండలం కేంద్రంలో మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గోపాల్‌నాయక్ చెక్కు అందించారు.

చేవెళ్ల : ఇటీవల బీజేపీ చేవెళ్ల మండల నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన అత్తెల్లి అనంతరెడ్డిని చేవెళ్ల మండల కేంద్రంలో ఓబీసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చీర శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు సన్మానించారు. నాయకులు సామ విఠల్‌రెడ్డి, కరికే సత్యనారాయణ, రవీందర్, నరేందర్‌గౌడ్, చంద్రశేర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

శంకర్‌పల్లి : శ్రీమాణికేశ్వరి మాత పాదుకా ప్రతిష్ఠ 20వ వార్షికోత్సవం ఫిబ్రవరి 2నుంచి 5 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యదర్శి శంకర్ తెలిపారు. శంకర్‌పల్లిలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ వార్షికోత్సవానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించినట్లు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

శంకర్‌పల్లి : మోకిల గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం రేడియల్ రోడ్డులో పోకుండా చూడాలని ఆలయ ధర్మకర్త వడ్డే లక్ష్మయ్య అధికారులను వేడుకున్నారు. మోకిలలోని ఆలయం వద్ద శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన పట్టాభూమి 4ఎకరాలు అమ్మగా వచ్చిన రూ.1.50కోట్లు ఖర్చు చేసి, తన భూమిలో దేవాలయాన్ని నిర్మించానని తెలిపారు. లక్ష్మీనరసింహస్వామి, ఆంజనేయస్వామి విగ్రహాలు ప్రతిష్ఠించానని తెలిపారు. దేవాలయం ముందు శివలింగం ప్రతిష్ఠించినట్లు వివరించారు. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ నుంచి వచ్చే రేడియల్ రోడ్డులో ఆలయంలోని కొంత భాగం పోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు భవనాల శాఖ అధికారులు పెద్ద మనస్సు చేసుకొని రోడ్డు నిర్మాణంలో భాగంగా దేవాలయం పోకుండా చూడాలని ఆయన విన్నవించారు. దేవాలయం పక్కనే తనకు భూమి ఉందని, ఆ భూమిలో నుంచి రోడ్డు వెళ్లేలా చూడాలని కోరారు.

ఆమనగల్లు : ఏఎస్ఐ నుంచి ఎస్ఐగా పదోన్నతి పొందిన యాదయ్యకు బీజేపీ జిల్లా నాయకులు బైకని శ్రీశైలం యాదవ్, సుండూరు శేఖర్‌ల ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసు స్టేషన్‌లో యాదయ్యను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. బీజేపీ సీనియర్ నాయకులు జెనిగల గిరియాదవ్, రామన్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

కడ్తాల్ : ట్రాఫిక్ రూల్స్‌ను అధిగమిస్తే చర్యలు తప్పవని సీఐ శివప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. హెల్మెంట్ ,లైసెన్స్, ఇన్సురెన్స్ లేకుండ నడుపుతున్న 20ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి చలాన్లు విధించినట్లు ఎస్ఐ నిరంజన్ తెలిపారు.

ఆమనగల్లు : సర్దార్ సర్వాయి పాపన్న జీవితం అందరికి ఆదర్శ ప్రాయమని టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీ కంఠమేశ్వర స్వామి ఆలయం ఆవరణలో ఈనెల 31న నిర్వహించే సర్వాయి పాపన్న విగ్రహ ప్రతిష్ఠ ఆహ్వాన పత్రికను ఆమనగల్లు పట్టణంలోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో సుంకిరెడ్డికి గౌడ సంఘం నాయకులు అందజేశారు.

యాచారం : మండలంలోని కుర్మిద్దలో హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఐదుగురు యువకులు ఒకే సమయంలో వాహనాలు నడుపుతూ కనిపించడంతో పోలీసులు వారిని ఆపి ఇకనుంచి హెల్మెట్ విధిగా ధరిస్తామని వారి చేత సీఐ కృష్ణంరాజు, ఎస్సై తేజం రెడ్డిలు ప్రమాణం చేయించారు.

క్రైం కార్నర్

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్.. రిమాండ్

షాద్‌నగర్‌రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి పెళ్లి చేసుకుంటానని నమ్మించి వివాహితతో సహజీవనం చేసి.. తీరా పెళ్లి చేసుకోమని అడిగినందుకు హత్య చేశాడు. ఈ ఘటనలో నిందితుడిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఏసీపీ రంగస్వామి తెలిపారు. షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం బండమీది అగ్రహారానికి చెందిన దేవదాసు అనే వ్యక్తి నందిగామ మండలం కన్హా శాంతివనంలో ప్రైవేట్ హాస్టల్‌లో వార్డెన్‌గా పనిచేసేవాడు. ఫరూఖ్‌నగర్ మండలం కందివనం గ్రామానికి చెందిన శివలీల భర్త మృతి చెందడంతో కన్హా శాంతివనంలోని కేసీసీ కళాశాలలో హౌజ్ కీపింగ్ పనులు చేసేది. దాంతో అతడికి ఆమెతో పరిచయం ఏర్పడింది. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. అప్పటికే నిందితుడిపై మహిళలను హతమార్చిన కేసులున్నాయి. బీఏ డిగ్రీ, ఈసీఈ పూర్తిచేసిన తర్వాత 2012లో ఇంద్ర సుహాసిని అనే మహిళను పెళ్లి చేసుకున్నాడు. ఆమెకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. సంసారం విషయంలో మనస్పర్థలు రావడంతో భర్తను విడిచిపెట్టి పుట్టింటికి వెళ్లింది. తర్వాత కాంట్రాక్ట్ జూనియర్ లైన్‌మ్యాన్‌గా ఆంధ్రప్రదేశ్‌లో పనిచేశాడు. భార్య వదిలి వెళ్లిన తర్వాత బైలుప్పల గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళతో పరిచయం పెంచుకుని సహజీవనం చేశాడు. కొన్ని రోజులకు ఆమె ఇతరులతో మాట్లాడుతుందనే అనుమానంతో మోటార్ సైకిల్‌పై తీసుకెళ్లి గొంతు నులిమి చంపాడు ఆమె శవాన్ని పెట్రోల్‌పోసి తగులపెట్టాడు. 2024లో మరో కేసులో కర్నూలు జిల్లా కేంద్రంలోని ఓ టిఫిన్ సెంటర్‌లో పనిచేసే మహళతో శారీరక సంబంధం పెట్టుకున్నాడు. ఆ విషయం ఆమె భర్తకు తెలియడంతో అతడికి కలవకుండా చేశాడు. దాంతో ఆమె భర్తను అడ్డు తొలగించుకోవాలని ఇంటికి వెళ్లి కత్తితో దాడి చేశాడు. దాంతో అతడిపై కర్నూలు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ తెరిచారు. తనపై పోలీస్ నిఘా ఎక్కువైందని అక్కడి నుంచి షాద్‌నగర్‌కు మకాం మార్చాడు. కన్హా శాంతివనంలో పనికి కుదిరాకా శివలీలతో పరిచయం పెంచుకున్నాడు. నిందితుడి మాటలు నమ్మిన ఆమె అతడితో సహజీవనం చేసింది. చివరకు ఆమె పెళ్లి చేసుకొమ్మని ఒత్తిడి చేయడంతో ఈనెల 20న షాద్‌నగర్‌కు పిలిచి సంఘమేశ్వర లాడ్జిలో రూం బుక్ చేసుకున్నారు. అదేరోజు చీరతో ఆమె గొంతు బిగించి హత్యచేశాడు. ఆమె శరీరంపై ఉన్న బంగారు, వెండి ఆభరణాలు దొంగిలించి పారిపోయాడు. పక్కా ఆధారాలతో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు వివరించారు.. శంషాబాద్ ఏసీపీ రాజేష్ ఆదేవాల మేరకు షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ సారథ్యంలో సిబ్బంది నిందితుడిని పట్టుకున్నట్లు తెలిపారు.

రైలుకింద పడి గుర్తుతెలియని యువతి ఆత్మహత్య

షాద్‌నగర్ రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రైలుకింద పడి గుర్తుతెలియని యువతి మృతిచెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపారు. సుమారు 22 నుంచి 25 ఏళ్ల వయస్సున్న యువతి శనివారం సాయంత్రం 5.30 గంటల సమయంలో సికింద్రాబాద్ నుంచి విశాఖపట్టణం వెళ్లే రైలుకింద పడి మృతిచెందినట్లు తెలిపారు. మెరూన్ బ్లాక్‌కలర్ పంజాబ్ డ్రస్ ధరించి ఉన్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 98480-90426 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

2తులాల బంగారం, 10 తులాల వెండి ఆభరణాలు, రూ.50వేలు చోరీ

యాచారం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నతూండ్లలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ఇంటికి తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. ఈనెల 19న చిన్నతూండ్లకు చెందిన రమేష్ తీర్థయాత్రకు వెళ్లారు. శనివారం మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి తలుపులు తెరిచి ఉండడం చూసి పోలీసులకు సమాచారమందించాడు. పోలీసులు వచ్చి పరిశీలించి విచారణ చేపట్టారు. 2తులాల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.50వేల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహరావు తెలిపారు.

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు


కొత్తూర్ : రంగులు వేసిన తర్వాత కళకళలాడుతున్న ప్రాథమికోన్నత పాఠశాల

కేశంపేట/కొత్తూర్/ఆమనగల్లు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవానికి ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు ముస్తాబయ్యాయి. శనివారం తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, మానవవనరుల భవనం, పోలీస్ స్టేషన్‌లో గణతంత్ర వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశారు. జాతీయ జెండా తోరణాలను సిద్ధం చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులు ఏర్పాట్లు చేసుకున్నారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పరిధిలోని గ్రామాల్లో ఏర్పాట్లు చేశారు. కాగా, సంవత్సరాలుగా రంగులు వేయకపోవడంతో కళాహీనంగా మారిన కుమ్మరిగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు చదువులు సాగించేందుకు ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. ఇటీవల కుమ్మరిగూడలో ప్రజాపాలన సభకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరైనారు. మాజీ వార్డు సభ్యుడు మహేష్‌గౌడ్, భరత్, రవిలతో పాటు ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు పాఠశాల దుస్థితి గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. గణతంత్ర వేడుకలు జరుపుకోలేని పరిస్థితి ఉందని వివరించారు. ఎమ్మెల్యే వెంటనే స్పందిస్తూ పాఠశాలకు కలర్లతో పాటు, ఫర్నిచర్, ప్రింటర్ ఏర్పాటుకు రూ.50వేలు అందజేస్తానని ప్రకటించారు. పాఠశాలకు కలర్లతో పాటు, ఫర్నిచర్‌ను సమకూర్చారు. ఎమ్మెల్యే సహకారంతో ముస్తాబు కావడంతో గ్రామస్తులు హర్షం చేశారు.


కడ్తాల్ : ఎక్వాయిపల్లిలో భారత్ చిత్రాన్ని ముగ్గుతో తీర్చిదిద్దుతున్న అంగన్‌వాడీ టీచర్లు

పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడాపోటీలు

ఆమనగల్లు , జనవరి 25 (ఆంధ్రజ్యోతి): భారత గణతంత్రదినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఆమనగల్లు పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో శనివారం విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహించారు. గత రెండు, మూడు రోజులుగా ఏ పాఠశాల క్రీడామైదానం చూసినా విద్యార్థులతో కళకళలాడుతున్నాయి. విద్యార్థిని, విద్యార్థులు ప్రతిభ చాటుకుంటున్నారు. విజేతలకు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా నేడు(ఆదివారం) బహుమతులు ప్రదానం చేయడానికి ఏర్పాట్లు చేశారు. పలు చోట్ల కళాశాలల్లో క్రీడలు నిర్వహించారు. గణతంత్ర వేడుకల నేపథ్యంలో క్రీడామైదానాలు విద్యార్థులతో సందడిగా మారాయి.